సాక్షి
వైఎస్సార్ జిల్లా
మంగళవారం । 27 । మే । 2025



పిచ్చికుక్క స్వైర విహారం

బద్వేలు పట్టణంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 15 గంటల వ్యవధిలో 45 మందిని కరిచి తీవ్రంగా గాయపరిచింది. - 8లో



అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
36.2 /25.8

వాతావరణం

జిల్లాలో సోమవారం 25.8 - 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఆర్టీసీ అధికారులతో మంత్రుల సమీక్ష

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలో జరగనున్న మహానాడు కార్యక్రమానికి కడప జోన్‌లోని వైఎస్సార్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి బస్సు సర్వీసులను నడపాలని రాష్ట్ర మంత్రులు సూచించారు. సోమవారం ఆర్టీసీ ఆర్‌ఎం, ఈడీ కార్యాలయలలో ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, నారాయణ సమీక్ష నిర్వహించారు.అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్టీసీ కడపజోన్ ఈడీ పైడి చంద్రశేఖర్, ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి, కడపజోనల్ చైర్మన్ నాగరాజుతోపాటు ఆర్టీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

284 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా సోమవారం సాంఘికశాస్త్ర పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా 28 పరీక్షా కేంద్రాలకుగాను 1969 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1685 మంది హాజరుకాగా 284 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని పరీక్షా కేంద్రాలను నాలుగు బృందాల ఫ్లయింగ్ స్క్వాడ్ 12 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా డీఈఓ షేక్ షంషుద్దీన్ మూడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఖనిజ నిక్షేపాలపై కేంద్రం అన్వేషణ



ఖనిజ నిక్షేపాల కోసం యంత్రాల ద్వారా అన్వేషిస్తున్న కేంద్ర ప్రభుత్వ సంస్థ అధికారులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీకి సంబంధించి కొత్తపల్లె గ్రామ పరిసరాల్లో సోమవారం నుంచి కేంద్ర ప్రభుత్వ సంస్థ అధికారులు ఖనిజ నిక్షేపాల కోసం తవ్వకాలు ప్రారంభించారు. ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకుని 20 అడుగుల లోతు వరకు బోర్లు వేసి ఖనిజాల కోసం అన్వేషణ సాగిస్తున్నారు. ఇందుకోసం అనేక వాహనాలను ఏర్పాటు చేశారు. ముందుగా సంబంధిత రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకుని పనులను ప్రారంభించారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన అధికారులు ఈ పనులు చేపడుతున్నారు. గతంలో హెలికాప్టర్ ద్వారా పర్యటించి ఖనిజాలు నిక్షేపాలు ఉండొచ్చని చూపించిన జియోట్యాగ్ ఆధారంగా ప్రస్తుతం పరిశీలన చేస్తున్నారు.

నేడు కడపలో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు కడప నగరంలోని తమ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీ కంపెనీలో ఐటీ, నాన్ ఐటీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. 2023, 24, 25 సంవత్సరాలలో ఇంటర్మీడియేట్ పాసైన వారు ఇందుకు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి రూ. 15,000 నుంచి రూ. 20,000 వరకు హోదానుబట్టి వేతనం ఉంటుదన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ విద్యార్హతలు, ఫోటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మామిడి పంటకు ధర కల్పించాలి




నిరసన వ్యక్తం చేస్తున్న మామిడి రైతులు, వ్యాపారులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలో మామిడి పంటలకు ధర కల్పించాలని సోమవారం మామిడి రైతులు, వ్యాపారులు స్థానిక ప్రైవేటు మార్కెట్ యార్డు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు కె మణి మాట్లాడుతూ జూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం మామిడి కాయల కోత తర్వాత కుట్రపూరితంగా ధరలు తగ్గిస్తూ రైతులు, వ్యాపారులు నష్టపోయే విధంగా కుట్రలు చేస్తోందన్నారు. మామిడి కాయలను తోలు కొని ధరల్లో వ్యత్యాసాలు చూపడం తగదన్నారు. అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు తక్షణమే పరిష్కరించకుంటే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు.

- **బాబు** కడుపు నిండా కత్తులు.. పైకేమో కౌగిలింతలు..
- ఇక్కడికొచ్చినప్పుడల్లా సీమ బిడ్డేనంటూ గొంతు సవరించేది ఆయనే..
- ఇక్కడి పరిశ్రమలు తరలించి యువత గొంతు కోసిందీ ఆయనే..
- మెజార్టీ సీట్లిచ్చినందుకు మెడికల్ సీట్లను అడ్డుకుంది ఆయనే..
- నమ్మించి నట్టేట ముంచడంలో ఆయన తర్వాతే ఎవరైనా..
- తరలించనని మాటిచ్చి.. 'ఏపీజీబీ'ని తరలిస్తున్నారు..
- ఎంతైనా వెన్నుపోటు పొడవడంలో బాబు బ్రాండ్ అంబాసిడరే..
- ఓసారి చూద్దామంటూ కడప మీకు ఓట్లేసింది..
- ఈ గడప మెజార్టీ సీట్లు ఇచ్చింది..
- మరి..మీరేం చేశారు.. బాబూ..
- గుక్కెడు నీళ్లిచ్చారా.. పోనీ గుప్పెడు నిధులిచ్చారా..!
- ప్రజలపై కత్తిగట్టారు.. కక్షగట్టారు.. ఇక్కడి అభివృద్ధిపై కన్నెర్ర చేశారు..
- ఏమిచ్చారని.. ఈ 'మహానాడు' సోకులు.. ఏం సాధించారని.. ఈ చుట్టపు చూపులు!
- బాబూ.. మీ తీరింతే.. మీరు మారరంతే.. కడపంటే.. ఎప్పుడూ మీకు కడుపుమంటే!

● బాబు తీరే అంత..

కడపంటే కడుపు మంట!



సాక్షి ప్రతినిధి, కడప : నేను రాయలసీమ బిడ్డను.. ఇక్కడికొచ్చినప్పుడల్లా సీఎం చంద్రబాబునాయుడు గొప్పగా చెబుతారు. ఈ ప్రాంతానికి ప్రత్యేకించి అభివృద్ధి ఫలాలు అందించడంలో పూర్తిగా చేతులెత్తేస్తారు. రాయలసీమ ముఖ్యమంత్రులు కనబరచిన శ్రద్ధాశక్తులను ఆయన ఎప్పుడూ ఆచరణలో చూపెట్టలేదు. తాజాగా ఏడాది కూటమి ప్రభుత్వంలోనూ కడప గడపపై నిర్లక్ష్యమే చూపించారు. ఎప్పట్లానే కడప అంటే కడుపు మంట ప్రదర్శించారు. ఒక్క పరిశ్రమ తీసుకురాకపోగా, ఎంబీబీఎస్ సీట్లు భర్తీ చేయకుండా తిరస్కరించారు.

● ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాయలసీమ ప్రజల ఓట్లు కావాలి కానీ, ఈ ప్రాంతం అభివృద్ధి చేయాలనే తపనే అస్సలు కన్పించదు. తన సొంత నియోజకవర్గం కుప్పానికి కూడా సాగునీరు అందించేందుకు మనస్సు రాలేదు. నేనూ సీమ బిడ్డనే అంటూ రంకెలేసే చంద్రబాబు, రాయలసీమకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధిని కొనసాగించలేని దుస్థితిలో ఉన్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అందుకు చక్కటి నిదర్శనంగా పులివెందుల మెడికల్ కళాశాల నిలుస్తోంది. రూ.530 కోట్లతో వైఎస్ జగన్ సర్కార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మించింది. దీనికోసం నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) 50 మెడికల్ సీట్లు మంజూరు చేసింది. మంజూరైన ఈ సీట్లను సైతం సీఎం హోదాలో చంద్రబాబు తిరస్కరించడం గమనార్హం.



- మంజూరైన 50 మెడిసిన్ సీట్లను వద్దన్న బాబు సర్కార్
- ఎంఎస్ఎంఈ అమరావతికి తరలింపు
- ఏపీజీబీ హెడ్ ఆఫీసు తరలింపునకు సన్నాహాలు
- పడకేసిన సాగునీటి ప్రాజెక్టుల పురోగతి
- ఏడాది చంద్రన్న పాలనలో జిల్లాకు ఒరిగింది శూన్యం

కొప్పర్తి పారిశ్రామికవాడ

వైఎస్ హయాంలో కుప్పం దాహార్తికి కృషి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అభివృద్ధి విషయంలో ఆకాశమే హద్దుగా చేశారు. ఇందులో కుల,మత ప్రాంతీయ వంటి భేదాలు అస్స లుండవని రుజువు చేశారు. దీనికి అనేక ఉదాహరణలున్నాయి. చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పం ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్విత పరిష్కారం చూపేందుకు రూ.52 కోట్లతో పాలారు రిజర్వాయర్ మంజూరు చేశారు. కర్ణాటక రాష్ట్రంలో ప్రారంభమై కుప్పం మీదుగా తమిళనాడుకు వెళ్లే పాలారు నదిపై రిజర్వాయర్ నిర్మించి కుప్పం నియోజకవర్గానికి తాగు, సాగునీరు అందించే బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు. తర్వాత తమిళనాడు ప్రజలతో కొందరు కోర్టులో కేసు వేయించడంతో అప్పట్లో ఆ పనులు పెండింగ్‌లో పడ్డాయి. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సైతం హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా కుప్పం నియోజకవర్గానికి నీరు ఇచ్చారు. శాంతిపురం, రామకుప్పం చెరువులకు నీటితో నింపి పెద్ద మనుస్సు చాటుకున్నారు. చంద్రబాబేమో పులివెందుల మెడికల్ కళాశాలకు మంజూరైన ఎంబీబీఎస్ సీట్లను రద్దు చేస్తూ లేఖ రాయడం గమనార్హం.

జీఎన్‌ఎస్‌ఎస్ రెండోదశ పనుల ఊసేదీ..!

గాలేరు-నగరి సుజల స్రవంతి పథకం ద్వారా జిల్లాలో 1.65లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాలనే సంకల్పం. తొలిదశ పనులల్లోని రిజర్వాయర్లను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి దాదాపు పూర్తి చేశారు. ఆ పనులు పూర్తి కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ విశేషంగా కృషి చేసింది. పైగా జీఎన్‌ఎస్‌ఎస్, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అనుసంధానం చేయాలనే దిశగా అడుగులు వేశారు. ఆ పనులను కూడా కొనసాగించలేని దుస్థితిలో చంద్రబాబు సర్కార్ ఉండిపోయింది. ఎన్నికల హామీగా జీఎన్‌ఎస్‌ఎస్ రెండవ దశ పనులు కూడా కొనసాగిస్తామని ప్రకటించిన సీఎం చంద్రబాబు చిత్తశుద్ధి చూపడంలో విఫలమైయ్యారని విశ్లేషకులు వివరిస్తున్నారు. ఇక టూరిజం సర్క్యూట్, హార్టికల్చర్ హబ్ ఏర్పాటు కలగానే మిగిలిపోయింది.



పులివెందులలోని మెడికల్ కళాశాలభవనం



కడప నగరంలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయం

బాధ్యత ఎరుగని ప్రజాప్రతినిధులు

క్రమం తప్పకుండా జిల్లా నుంచి పబ్లిక్ సెక్టార్ తరలిస్తుంటే ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారపార్టీ ప్రజాప్రతినిధులు బాధ్యతను గుర్తించలేకపోతున్నారు. కొత్త పరిశ్రమలు తీసుకరాకపోయినా కనీసం ఉన్న సంస్థలనైనా కాపాడుకోవాల్సిన దిశగా ప్రయత్నాలు చేసినా దాఖలాలు లేవని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఆదాయ మార్గాలపై ఉన్న శ్రద్ధ ప్రాంతంపైనా ప్రజలపైనా చూపెట్టలేదనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఇక్కడి అభివృద్ధిపై నోరు తెరిచిన పాపాన పోలేదని జిల్లావాసులు తూర్పారబడుతున్నారు.

ఎంఎస్ఎంఈ తరలింపు...

కడప అంటే తొలి నుంచి చంద్రబాబు హయాంలో వివక్షత తెరపైకి వస్తోంది. మునుపంతా ఓట్లు-సీట్లు ఇవ్వలేదు, మీకేందుకు పనులు చేయాలంటూ సీఎం హోదాలో బాహాటంగా వ్యాఖ్యానించిన చంద్రబాబునాయుడు తాజాగా ఓట్లు-సీట్లు లభించినా అదే వివక్షత చూపుతున్నారు. క్రమం తప్పకుండా కడప అంటే కడపు మంట ప్రదర్శిస్తున్నారు. భారత ప్రభుత్వం కొప్పర్తి మెగా ఇండస్ట్రీయల్ హబ్‌కు రూ.250 కోట్లుతో మంజూరు చేసిన రెండవ ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని సైతం అమరావతికి తరలించారు. వెనుకబడిన జిల్లాను సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఎంఎస్ఎం ఈ అభివృద్ధి చెందిన అమరావతికి తరలించారు. 2014-19హయాంలో కడపకు మంజూరైన ఉర్దూ యూనివర్శిటీని సైతం కర్నూలుకు తరలించారు. తాజాగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు హెడ్ ఆఫీసు తరలింపుకు రంగం సిద్ధం చేశారు. గ్రామీణ బ్యాంకుల పునర్వవ్యస్థీకరణ పేరుతో ఏపీజీబీ హెడ్ ఆఫీసును ఎగనామం పెట్టేందుకు సిద్ధమయ్యారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



మహానాడు వేదికపై నాయకుల సంఘీభావం
(ఇన్‌సెట్) ముఖ్యమంత్రికి నాయకుల స్వాగతం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో మూడు రోజులపాటు జరగనున్న మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సాయంత్రం 7:35 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. కడప విమానాశ్రయంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు, పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులు రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌లు పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సీఎం మహానాడు ప్రాంగణానికి సాయంత్రం 7.40 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప అగ్రికల్చర్ : బిందు, తుంపర సేంద్య పరికరాలు కావాల్సిన రైతులు ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా పొందాలని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ బిందు, తుంపర సేద్య పరికరాల కోసం రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రైతులు కోరిన కంపెనీ ఎంపిక చేసుకుని పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఏపీ ఎంఐపీ ద్వారా నిర్ణయించబడిన సబ్సిడీ ప్రకారం పట్టాదారు పాసుపుస్తకంలో 5 ఎకరాల వరకు పొలం కలిగిన చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీ, ఇతరులకు 90 శాతం సబ్సిడీ, అలాగే మధ్య రకం రైతులు 5 నుంచి 10 ఎకరాల పొలం గల రైతులకు 90 శాతం, పెద్ద రైతులు అంటే 12.5 ఎకరాలు గల రైతులకు 50 శాతం సబ్సిడీ ద్వారా డ్రిప్పు పరికరాలు అందజేస్తామని పేర్కొన్నారు. అలాగే చిన్న, మధ్య తరగతి రైతులకు స్ప్రింకర్లు 50 శాతం సబ్సిడీతో ఇస్తామన్నారు. పేరు నమోదు చేసుకున్న రైతుల పొలాల్లో ప్రాథమిక తనిఖీ జరిగిన తరువాత రైతు చెల్లించాల్సిన రైతు వాటా రిజిస్టర్ అయిన ఫోన్ నెంబర్‌కు సంక్షిప్త సమాచారం వస్తుందని వివరించారు.

టీడీపీ..మహా కవ్వింపు!





అంబేద్కర్ సర్కిల్‌లో మాలమహానాడు నేతల నిరసన, వైఎస్సార్ సర్కిల్‌ను చుట్టేసిన టీడీపీ జెండాలు

- దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పచ్చ తోరణాలు
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అశోక చక్రాన్నీ వదలని 'తమ్ముళ్లు'
- రగిలిపోతున్న అభిమానులు... మాల మహానాడు నేతల నిరసన
- చోద్యం చూస్తున్న కార్పొరేషన్ యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, కడప : మహానాడు సందర్భంగా కడపలో టీడీపీ కవ్వింపు చర్యలకు దిగుతోంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలతో పాటు, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని, దేశ చిహ్నామైన అశోక చక్రాన్ని కూడా అవమానిస్తున్నారు. కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి ప్రచార పిచ్చి అందరి మనోభావాలు దెబ్బతినేలా చేస్తోంది. ప్రతి సర్కిల్‌లో పసుపు జెండాలు కట్టి అన్ని వర్గాలనూ రెచ్చగొట్టే పనిలో పడింది. నేటి నుంచి మూడు రోజుల పాటు కడపలో చేపట్టనున్న మహానాడు కోసం నగరంలో ప్రతి చోటా ఫ్లెక్సీలు, జెండాలతో నింపేస్తున్న టీడీపీ నేతలు, మహనీయులను కూడా అవమానపరుస్తున్నారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడ్డాలో మేం జెండా ఎగురవేశాం అని చెప్పుకునేందుకు టీడీపీ నానా తంటాలు పడుతోంది. గత ఎన్నికల్లో ఎలాగోలా గట్టెక్కినా టీడీపీ, ఇప్పుడు తామేదో గొప్ప విజయం సాధించినట్లు కడపలో మహానాడు నిర్వహించుకుంటోంది. అంతవరకూ సరే అనుకున్నా, దీని కోసం ప్రత్యర్థి పార్టీలను, వివిధ వర్గాలను రెచ్చగొట్టే చర్యలకు దిగడం సమస్యాత్మకంగా మారుతోంది. కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ప్రచార పిచ్చి మహనీయులను సైతం అవమానపరిచే స్థాయికి వెళ్లింది. నగరంలోని అలంఖాన్‌పల్లి సర్కిల్, కృష్ణాపురం సర్కిళ్లలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలు ఉన్నాయి. ఆ విగ్రహాలకు కూడా పసుపు జెండాలు కట్టడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది.



కడప నగరం వై జంక్షన్‌లోని అశోకస్థూపానికి..

మహనీయుడికి పసుపుతోరణం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్నీ అవమానించడంపై అంబేద్కర్ వాదులంతా మండిపడుతున్నారు. కడపలో ఎమ్మెల్యే ప్రచార ఆర్భాటంలో మహనీయులను అవమానపరచడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. కడప నగరంలోకి అంబేద్కర్ విగ్రహం చుట్టూ టీడీపీ జెండాలు కట్టడం ఇప్పుడు ఆయన అభిమానులకు ఆగ్రహాన్ని తెప్పించింది. అంబేద్కర్ విగ్రహం వద్ద టీడీపీ తీరును నిరసిస్తూ నేలపై కూర్చుని మాలమహానాడు నేతలు నిరసన తెలిపారు. మహాత్మగాంధీ, ప్రకాశం పంతులు, సైనిక్ సర్కిల్, అన్నమయ్య విగ్రహం ఇలా అన్నీ విగ్రహాలను పసువుమయం చేశారు. అన్ని వర్గాల మనోభావాలు దెబ్బతింటున్నా పట్టించుకోని అధికారులు.. పైగా మహానాడు సేవలో మునిగి తేలుతుండడం గమనార్హం.

రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలి

ఎవరి పార్టీపై వారికి అభిమానం ఉండటం సహజమే. హద్దులు దాటి పక్కవారిని రెచ్చగొట్టేలా ప్రయత్నించడం సరైంది కాదని విశ్లేషకులు అంటున్నారు. ఇలాంటి కవ్వింపు చర్యలు మంచిది కాదని హితవు పలుకుతున్నారు. ఇదిలా ఉంటే నిత్యం మహానాడు పనులను పర్యవేక్షిస్తున్న జిల్లా పోలీసు యంత్రాంగం ఇలాంటి చర్యలను ఎలా సమర్థిస్తుందనే ప్రశ్న తలెత్తుతోంది. ఒక్క వైఎస్సార్ విగ్రహమే కాదు... చివరికి దేశ చిహ్నమైన అశోకచక్రంతో కూడిన వై జంక్షన్ సర్కిల్‌ను కూడా పసుపు జెండాలతో కప్పేయడం గమనార్హం. అలాగే మరో అడుగు ముందుకు వేసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని పసుపు మయం చేసేశారు.





టీడీపీ

- జిల్లాలో తారస్థాయికి టీడీపీ నేతల విభేదాలు
- ఎమ్మెల్యేల విజయం కోసం పనిచేసిన నేతలని ఖాతరు చేయని వైనం
- మహానాడుకు దూరంగా ఉండాలని కాపు నేతలు నిర్ణయం
- దూరంగా ఉండిపోయిన ఎమ్మెల్సీ సీఆర్సీ, మాజీ ఎమ్మెల్సీ బత్యాల

సాక్షి ప్రతినిధి, కడప : అసలే కడప జిల్లాలో టీడీపీ మనుగడ అంతంత మాత్రమే. మొన్నటి ఎన్నికల్లో కాలం కలిసొచ్చి ఐదుగురు ఎమ్మెల్యేలయ్యారు. వాపును చూసి బలుపనుకున్న టీడీపీ అధిష్టానం మహానాడు కడపలో నిర్వహించి వైఎస్సార్సీపీకి తమ పవర్ ఏంటో చూపాలని పగటి కలలు కంటోంది. అధిష్టానం ఆశలపై స్థానిక నేతలు నీళ్ల చల్లుతున్నారు. మహానాడు నేపథ్యంలో నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఢీ అంటే ఢీ అంటూ రోడ్డెక్కి కొట్టుకునే స్థాయికి దిగజారాయి. అన్నీ నియోజక వర్గాల్లో అదే పరిస్థితి దర్శనమిస్తోంది.

మహానాడు నేపథ్యంలో టీడీపీ అధిష్టానం కడపలో తామేదో గొప్ప విజయం సాధించామని చెప్పుకునే ప్రయత్నం చేస్తోంది. స్థానిక నాయకత్వం మాత్రం టీడీపీ పరువును రోడ్డున పడేస్తున్నారు. వర్గవిభేదాలు తారాస్థాయికి చేరి ఆపార్టీ పరువును రోడ్డు కీడుస్తున్నాయి. ప్రతి నియోజకవర్గంలో నాయకుల మధ్య ఆధిపత్య పోరు పెరిగిపోయింది. మహానాడుకు గైర్హాజరయ్యే స్థాయికి చేరాయి. ప్రెస్‌మీట్‌లు పెట్టి మరీ దుమ్మెత్తి పోస్తున్నారు. కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డిపై వార్ స్టార్ట్ అయ్యింది. సీనియర్ నేత లక్ష్మిరెడ్డి, కార్పొరేటర్ ఉమాదేవి ప్రెస్‌మీట్ పెట్టి మరీ మాధవి, వాసు తీరును తూర్పారబట్టారు. ఇది మహానాడు నేపథ్యంలో హాట్ టాపిక్‌గా మారింది. మరో వైపు నగర టీడీపీ అధ్యక్షుడి సానపురెడ్డి శివకొండారెడ్డిపై ఎమ్మెల్యే అనుచరులే హత్యాయత్నం చేయడంతో ఆయన కూడా ఎమ్మెల్యేకు దూరంగా ఉంటున్నారు. మైనార్టీల్లో సీనియర్ నేత అమీర్‌బాబు పరిస్థితి కూడా అలానే ఉండిపోయిందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

నేతల మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలు

ఇక పులివెందుల నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇరువురు నేతలు నువ్వా నేనా అన్నంతగా రోడ్డెక్కి కుమ్ములాటలకు కూడా దిగారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి తప్ప అక్కడ వేరే నాయకత్వం ఉండడానికి వీల్లేదనే స్థాయికి చేరింది. ఎన్నికల వరకూ ఇన్‌ఛార్జిగా ఉక్కు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, లింగారెడ్డి నాయకులకు పార్టీ నుంచి తీసేయాలనే డిమాండ్‌సైతం తీసుకొచ్చారు. ఎమ్మెల్యే వరద రాజులురెడ్డి తన అనుచరులతో వైరిపక్షంపై బాహాటంగానే ప్రెస్‌మీట్ పెట్టి మరీ విమర్శలు చేయించారు. రాయచోటిలో సుగవాసి బ్రదర్స్, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి కనుమరుగయ్యారు. రాజంపేట టీడీపీ తలా తోక లేకుండా తయారయ్యింది. పార్టీకి దిశా నిర్దేశ్యం చేసే నాయకుడు కరువయ్యారు. బద్వేల్‌లో రితీష్‌రెడ్డితో పాతతరం టీడీపీ నేతలకు అసలు పొసగడం లేదు.

మహానాడుకు దూరంగా ఎమ్మెల్సీ సీఆర్సీ

మహానాడుకు దూరంగా ఉండిపోవాలని ఎమ్మెల్సీ సీ రామచంద్రయ్య నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల్లో కాపు(బలిజ) నాయకులను వాడుకుని గెలిచిన తర్వాత వదిలేశారని పలువురు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఈ ఏడాది కాలంలో కాపు నేతలు ఎమ్మెల్సీ రామచంద్రయ్య, రైల్వేకోడూరుకు చెందిన మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడులను పూర్తిగా పక్కన పెట్టడం, వారు బలిజ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో జిల్లాలో బలిజలు కూటమిపై తిరుగుబావుటా ఎగురవేశారు. వీరంతా మహానాడుకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నట్లు సమాచారం. రాజంపేట నుంచి ఎన్నికలల్లో పోటీచేసి ఓడిపోయిన బలిజ నాయకుడు సుగవాసి బాలసుబ్రహ్మణ్యంను కాదనీ, జగన్మోహన్‌రాజును తెరపైకి తెచ్చారు. ఇప్పుడు దుర్గాప్రసాద్‌కు పార్టీ ఇంఛార్జి బాధ్యతలు అప్పజెప్పడం కొత్త వివాదానికి దారితీసింది. కాగా నేటి నుంచి మూడు రోజుల పాటు సాగనున్న మహానాడుకు జిల్లాలోని నేతల మధ్య విభేదాలు పార్టీకి తలనొప్పిగా మారుతుందనడంలో సందేహం లేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కాంట్రాక్టర్‌ మృతి



బొలెరో వాహనం ఢీ కొనడంతో మృతి చెందిన వెంకటరెడ్డి



వెంకటరెడ్డి (ఫైల్‌)

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల – బద్వేలు రోడ్డులో చెన్నారెడ్డిపేట సమీపంలో సోమవారం ఉదయం మోటార్‌బైక్‌లో వెళుతున్న పెద్దిరెడ్డి వెంకటరెడ్డి (56)ని బొలెరో వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మండలంలోని కొండుగారిపల్లెకు చెందిన వెంకటరెడ్డి చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేసేవారు. ఉదయం పని వద్దకు వెళ్లేందుకు బైక్‌లో వెళుతుండగా 4 వే లైన్స్‌ రోడ్డు పనికి చెందిన బొలెరో వాహనం అతివేగంగా వెనుక నుంచి ఢీ కొట్టి 50 మీటర్లు వెంకటరెడ్డిని బైక్‌తో సహా లాక్కొని వెళ్లింది. వెంకటరెడ్డి జిల్లా పరిషత్‌ ఛైర్మన్‌ రామగోవిందరెడ్డికి సమీప బంధువు కావడంతో పాటు వెంకటరెడ్డికి పెద్ద బంధువర్గం ఉంది. వెంకటరెడ్డి ప్రమాదంలో మృతి చెందిన వార్త తెలియడంతో పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు పెద్ద సంఖ్యలో జనం చేరుకున్నారు. ఆయన మరణంతో గ్రామంలో విషాదం నెలకొంది.

దుంపలగట్టు చెరువు మట్టి తరలింపుతో సంబంధం లేదు



రెడ్యం రవీంద్రారెడ్డి

ఖాజీపేట : చెరువు మట్టితో టీడీపీ నేత వ్యాపారం అంటూ తనపై బురద చల్లే విధంగా వార్త రాశారని దానితో తనకు ఎలాంటి సంబంధం లేదని కేసీ కెనాల్‌ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌ రెడ్యం రవీంద్రారెడ్డి తెలిపారు. సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఖాజీపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుంపలగట్టు చెరువులో మట్టిని జాతీయ రహదారి అవసరాల కోసం అధికారులు తరలించారన్నారు. అయితే అది తాను తరలిస్తున్నట్లు రాయడం తగదన్నారు. ఈ విషయంలో తన ప్రమేయం ఉన్నట్లు ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నానని తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం

- 15 గంటల వ్యవధిలో 45 మందిపై దాడి
- కుక్కకాటు బాధితులతో కిటకిటలాడిన ప్రభుత్వాసుపత్రి
- ఎట్టకేలకు కుక్కను పట్టుకుని చంపేసిన మున్సిపల్‌ సిబ్బంది
- ఘటనపై ఆరా తీసిన పురపాలకశాఖ మంత్రి, బద్వేలు ఎమ్మెల్యే



ప్రభుత్వాసుపత్రిలో బారులు తీరిన పిచ్చికుక్క కాటు బాధితులు



45 మందిని గాయపరిచిన పిచ్చికుక్క



పిచ్చికుక్కను అదుపులోకి తీసుకున్న మున్సిపల్‌ సిబ్బంది

బద్వేలు అర్బన్‌ : బద్వేలు పట్టణంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. కూలి పనులకు వెళ్లే కూలీని, బజారుకు వచ్చిన తండ్రికొడుకులను, స్వగ్రామానికి వెళ్లేందుకు వచ్చిన వృద్ధురాలిని, టిఫిన్‌ తెచ్చుకునేందుకు వచ్చిన వృద్ధుడిని, కూరగాయల కోసం వచ్చిన మహిళలను, ఇంటి పట్టున ఆడుకుంటున్న చిన్నారిని ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 15 గంటల వ్యవధిలో 45 మంది చిన్న, పెద్ద, వృద్ధులు, చిన్నారులు, మహిళలను కరిచి తీవ్రంగా గాయపరిచింది. చివరకు మున్సిపల్‌ సిబ్బంది వల పన్ని కుక్కను పట్టుకుని అంతమొందించారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై పురపాలకశాఖ మంత్రి నారాయణ, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ ఆరా తీశారు. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే..

పట్టణంలోని సిద్దవటం రోడ్డులో ఆదివారం రాత్రి 7 గంటల నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన, ఇతర ప్రాంతాల నుంచి పని నిమిత్తం పట్టణానికి వచ్చిన వృద్ధులు, చిన్నారులు, మహిళలు, యువకులను పిచ్చికుక్క తీవ్రంగా గాయపరిచింది. రోడ్ల మీద, నడుచుకుంటూ, ద్విచక్ర వాహనాల్లో వెళుతున్న వారిని వెంటాడి మరీ గాయపరిచింది. దీంతో గంటపాటు సిద్దవటం రోడ్డులో ప్రజలు తిరిగేందుకు భయభ్రాంతులకు గురయ్యారు. అలాగే పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తమ పిల్లలను ఇళ్లల్లోనే ఉంచుకుని తలుపులు వేసుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. 15 గంటల వ్యవధిలో సుమారు 45 మంది కుక్కకాటుకు గురై ఆసుపత్రి పాలయ్యారు. బద్వేలు చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున కుక్కకాటు బారిన పడటం మొదటిసారి కావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

కిటకిటలాడిన ప్రభుత్వాసుపత్రి..

కుక్కకాటు బాధితులతో, వారి బంధువులతో ప్రభుత్వాసుపత్రి కిటకిటలాడింది. ఆదివారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు సుమారు 18 మంది కుక్కకాటుకు గురవ్వగా సోమవారం తెల్లవారుజాము నుంచి 10 గంటల వరకు 27 మంది కుక్కకాటుకు గురయ్యారు. కుక్కకాటు బాధితుల హాహాకారాలతో ఆసుపత్రి ప్రాంగణం దద్దరిల్లింది. గాయపడిన వారిలో 6 మంది చిన్నారులు, 12 మంది వృద్ధులు, 27 మంది మధ్య వయస్కులు ఉన్నారు. వీరిలో మహాలక్షుమ్మ, దస్తగిరి, శ్రీను, నాగార్జున అనే వారికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సివిల్‌ సర్జన్‌ సుబ్బారెడ్డి, సిబ్బంది బాధితులకు ఏఆర్‌వీ ఇంజక్షన్లు అందించారు.

కుక్కను పట్టుకున్న సిబ్బంది..

పట్టణంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తున్న విషయం తెలిసిన వెంటనే మున్సిపల్‌ కమిషనర్‌ వి.వి.నరసింహారెడ్డి కుక్కను పట్టుకునేందుకు దాదాపు 50 మంది సిబ్బందిని పురమాయించడంతో పాటు సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రజలను జాగ్రత్తగా ఉండేలా సూచనలు అందించారు. దాదాపు రెండు గంటల పాటు శ్రమించిన మున్సిపల్‌ సిబ్బంది ఎట్టకేలకు ఆర్టీసీ బస్టాండు వెనుక భాగంలో సంచరిస్తున్న పిచ్చికుక్కను పట్టుకుని అంతమొందించారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఘటనపై ఆరా తీసిన మంత్రి, ఎమ్మెల్యే..



బద్వేలు పట్టణంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి 45 మందిని గాయపరిచిందని తెలుసుకున్న పురపాలకశాఖ మంత్రి నారాయణ, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ ఘటనపై ఆరా తీసి అధికారులతో మాట్లాడారు. వీలైనంత త్వరగా కుక్కను పట్టుకుని ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని మున్సిపల్‌ కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. అలాగే బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ మున్సిపల్‌ కమిషనర్‌ వి.వి.నరసింహారెడ్డి, ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సివిల్‌ సర్జన్‌ డాక్టర్‌ సుబ్బారెడ్డిలతో మాట్లాడారు. పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారికి క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు అందించాలని, వ్యాక్సిన్ల విషయంలో బాధితులు అశ్రద్ధ చేసే పరిస్థితి ఉన్న నేపథ్యంలో వైద్యులు బాధితుల ఫోన్‌ నెంబర్లు తీసుకుని వారికి ఫోన్‌ చేసి మరీ అన్ని డోసుల వ్యాక్సిన్లు అందించాలని డిప్యూటీ సివిల్‌ సర్జన్‌కు సూచించారు. అలాగే ప్రజలపై దాడి చేసిన పిచ్చికుక్క ఇతర కుక్కలను కరిచి ఉంటే అవి కూడా పిచ్చికుక్కలుగా మారే అవకాశం ఉందని, దీనిపై పూర్తిస్థాయిలో విచారించి జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్‌ కమిషనర్‌ను కోరారు.



పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులు

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం

కడప సెవెన్‌రోడ్స్‌ : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్‌)లో డీఆర్‌ఓ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కింది స్థాయి సిబ్బందిని పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలన్నారు.

- గోపవరం మండలం రామాంజనేయ నగర్‌కు చెందిన బత్తల వెంకట్రామయ్య ఇంటి నివాస స్థలానికి సంబంధించి అనుబంధం పత్రం మంజూరు చేయాలని అభ్యర్థించారు.
- కడప నబీకోటకు చెందిన ఎస్‌. కమాల్‌ బీ వృద్ధాప్య పింఛన్‌ మంజూరు కోసం విన్నవించారు.
- కాశినాయన మండలం రెడ్డి కొట్టాల గ్రామానికి చెందిన కె.రంగలక్షుమ్మ వితంతు పింఛన్‌ మంజూరు చేయాలని కోరారు.
- చాపాడు మండలం ఓబయ్యపల్లికి చెందిన తప్పెట చంద్ర ఓబుల్‌ రెడ్డి తన భూమిని ఇతరులు ఆన్‌లైన్‌ చేసుకున్నారని, దానిని తొలగించి వెబ్‌ ల్యాండ్‌లో తన భూమి విస్తీర్ణం నమోదు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, ఎస్‌డీసీలు శ్రీనివాసులు, వెంకటపతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడు

మోడల్‌ మెగా డీఎస్సీ పరీక్షను జయప్రదం చేయాలి



మెగా డీఎస్సీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్‌ : జిల్లా వ్యాప్తంగా ఈనెల 27వ తేదీన ఆర్‌ఎస్‌ఎఫ్‌ నేతృత్వంలో నిర్వహించనున్న మోడల్‌ మెగా డీఎస్సీ పరీక్షను డీఎస్సీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు డి.ఎం. ఓబులేసు యాదవ్‌ కోరారు. మెగా డీఎస్సీకి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కడపలోని వెంకట సాయి కోచింగ్‌ సెంటర్‌లో డైరెక్టర్‌ దామోదర్‌ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మోడల్‌ పరీక్షకు ఎస్‌జీటీ అభ్యర్థులు హాజరు కావాలన్నారు. ఎంట్రీ ఫీజు 50 రూపాయలు ఉందన్నారు. అభ్యర్థులు కడపలో 8639919308 నెంబర్‌కు ఫోన్‌ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే కడపలోని వెంకటసాయి కోచింగ్‌ సెంటర్‌, యూటీఎఫ్‌ భవన్‌లో కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. జమ్మలమడుగులో 8886238055 నంబర్‌ లేదా వివేకానంద జూనియర్‌ కాలేజీలో, ప్రొద్దుటూరులో 7036695591 నంబర్‌ లేదా సృజన్‌ కోచింగ్‌ సెంటర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నీటి కుంటలో పడి మహిళ మృతి

పెద్దమండ్యం : నీటికుంటలో ప్రమాదవశాత్తు పడి ఓ మహిళ మృతి చెందింది. మండలంలోని వెలిగల్లులో సోమవారం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వెలిగల్లులో నివసిస్తున్న మునిస్వామి భార్య సాలమ్మ (70) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. గత మంగళవారం ఇంటి నుంచి వెళ్లి పోయింది. గ్రామానికి సమీపంలోని ఊటకుంటలో ప్రమాదవశాత్తు పడిపోవడంతో సోమవారం శవమై కనిపించింది. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుమార్తె లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు.

తప్పిన ప్రమాదం

- పాత రిమ్స్‌లో నేల కూలిన చెట్టు
- పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసం



కడప పాత రిమ్స్‌లో నేల కూలిన చెట్టు



ధ్వంసమైన ద్విచక్ర వాహనాలు

కడప రూరల్‌ : ఉన్నఫళంగా చెట్టు నేల కూలింది. అదృష్టం కొద్ది ప్రాణాపాయం తప్పింది. సోమవారం కడప పాత రిమ్స్‌లో వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం ఎదురుగా ఉన్న పెద్ద నేరేడు చెట్టు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఉన్నట్లుండి పెద్ద శబ్దం చేస్తూ నేల కూలింది. ఎలాంటి ప్రాణ నష్టం కలగక పోవడం పెద్ద ఊరటగానే చెప్పుకోవచ్చు. అయితే పార్కింగ్‌ చేసిన పలు ద్విచక్ర వాహనాలు దెబ్బ తిన్నాయి. చెట్టు నేల కూలిన ప్రాంతంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం, పక్కనే ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రి, అలాగే రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన అగ్రిమెంట్స్‌, స్టాంప్‌ల కొనుగోలు తదితర అంశాల పనుల కారణంగా ఇక్కడ ఎక్కువగానే జన సంచారం ఉంటుంది. అదే విధంగా కార్యాలయ విధులకు వచ్చే ఉద్యోగులతో పాటు ఇతర పనులపై ఇక్కడికి వచ్చేవారు, పెద్ద సంఖ్యలో పలు వాహనాలను పార్కింగ్‌ చేస్తుంటారు. చెట్టు పడడంతో పలు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. కూలిన చెట్టు వేర్లు భూమిలో బలంగా లేకపోవడంతో నేల కూలినట్లుగా తెలుస్తోంది.

స్వచ్ఛ మహానాడు కోసం మంత్రుల సమీక్ష

కడప రూరల్‌ : కడపలో నిర్వహిస్తున్న మహానాడులో స్వచ్ఛ మహానాడు కోసం క్లీనింగ్‌ అండ్‌ బ్యూటిఫికేషన్‌ ఏర్పాట్లను సోమవారం మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ మహానాడు కార్యక్రమం కోసం మంత్రులు డ్రెస్‌ కోడ్‌ జాకెట్‌లను ధరించి అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల మంత్రులు, నేతలు వాసంశెట్టి సుభాష్‌,అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు,పట్టాభి పాల్గొన్నారు.

వైఎస్‌ విగ్రహాలకు కట్టిన పసుపు జెండాలు తొలగించకుంటే ఆందోళన

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



వల్లూరు : మహానాడు సందర్భంగా విచ్చల విడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న టీడీపీ మహానేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పసుపు జెండాలు, తోరణాలను కట్టడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పోచిమరెడ్డి రవీంద్రనాథరెడ్డి విమర్శించారు. కడపలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌ పరిధిలో ఎవరైనా జెండాలు గానీ, లేక మరేవైనా కట్టినప్పుడు మరుసటి రోజే తొలగించే కార్పొరేషన్‌ అధికారులు అధికార టీడీపీ పట్ల అతి ప్రేమ చూపుతూ పసుపు జెండాలు, తోరణాలను అలాగే ఉంచడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా అధికారులు విజ్ఞతతో స్పందించి వైఎస్‌ విగ్రహాల వద్ద ఉన్న పసుపు పచ్చ జెండాలను, తోరణాలను వెంటనే తొలగించాలని డిమాండ్‌ చేశారు. అధికారులు తొలగించక పోతే మంగళవారం ఉదయం 11 గంటలకు కడప – మైదుకూరు రోడ్డులో ఉన్న ఇర్కాన్‌ సర్కిల్‌లో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు.

అధికారులను సొంత పార్టీ పనులకు ఉపయోగించడం సిగ్గుచేటు

మహానాడు పూర్తిగా టీడీపీకి చెందిన సొంత కార్యక్రమం, అలాంటి సొంత పనులకు ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకోవడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అన్నారు. జిల్లా కలెక్టర్‌ నుంచి ఇతర జిల్లా స్థాయి అధికారులు సైతం ఇదేదో ప్రభుత్వ కార్యక్రమం అన్నట్లు మహానాడు కార్యక్రమానికి టీడీపీ నాయకుల కంటే అధిక ప్రాధాన్యత ఇవ్వడం సిగ్గుచేటని విమర్శించారు. మహానాడు వద్ద కేటాయించిన విధులకు హాజరయ్యేందుకు వస్తూ కటౌట్‌ విరిగి ఇద్దరు వీఆర్‌ఓలు తీవ్రంగా గాయపడటం బాధాకరమన్నారు.

మహానాడు కాదది విద్రోహ నాడు

సూపర్‌ సిక్స్‌ హామీలంటూ ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన టీడీపీ సంవత్సర పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని రవీంద్రనాథరెడ్డి విమర్శించారు. సంవత్సరం పూర్తి కావచ్చినా ఇప్పటికీ ఏ ఒక్క హామీని నెరవేర్చకపోవడంతో ఆ పార్టీ పట్ల ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. దాని నుంచి ప్రజలను పక్కదోవ పట్టించడానికి మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ఇది మహానాడు కాదని, విద్రోహనాడని ఆయన ధ్వజమెత్తారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లే లక్ష్యం



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్య

ప్రొద్దుటూరు కల్చరల్‌ : చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడమే తన లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు ఆర్‌.కృష్ణయ్య అన్నారు. ప్రొద్దుటూరులో సోమవారం బీసీ సమాఖ్య ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలు అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. బీసీలు అంతా ఏకమై బలమైన బీసీ ఉద్యమాలను నిర్మిస్తే బీసీల డిమాండ్లన్నీ సాధించుకోగలమన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలకు ప్రత్యేక బడ్జెట్‌ కేటాయించాలన్నారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు యలగాల నూకానమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్‌ సోమా లక్ష్మీనరసయ్య, సహ అధ్యక్షుడు సందు శివనారాయణ, రాష్ట్ర సెక్రటరీ జనరల్‌ బీపీ రాజు, జిల్లా అధ్యక్షుడు జింకా జయప్రకాష్‌, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, జిల్లా యువజన అధ్యక్షుడు శివనారాయణ యాదవ్‌, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురుమూర్తి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ బాలకృష్ణయాదవ్‌, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సుభాన్‌బీ, రాష్ట్ర కార్యదర్శి రెడ్డెయ్య, విజయకుమార్‌, గురప్ప, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అనుమతులు కొంత.. మట్టి తరలింపు కొండంత!



ఒంటిమిట్ట చెరువులో మట్టిని తరలించేందుకు ఉపయోగించిన జేసీబీ



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌

ఒంటిమిట్ట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం గడిచింది. అప్పటి నుంచి రెడ్‌బుక్‌ పరిపాలన మీద పెట్టిన ధ్యాస ప్రజా పరిపాలనపై పెట్టకుండా అక్రమార్జనకు కూటమి నేతలు నేనంటే నేను అంటూ వరుస పెడుతున్నారు. ప్రజలనే కాకుండా జల వనరులను కూడా దోచుకునే విషయంలో ఏమాత్రం తగ్గకుండా ఉన్నారు. ఇసుక, మట్టి, అడవిని కూడా దోచుకునేందుకు వెనుకాడటం లేదు. దోచుకుని దాచుకోవడంలో కూటమినేతల తరువాతనే మరెవరైనా అనే విధంగా మండలంలో నేతలు వ్యవహరిస్తున్నారు. ఇదే తంతు ఒంటిమిట్ట మండల కేంద్రంలో జరుగుతోంది. మండల కేంద్రమైన ఒటిమిట్ట చెరువులో రైతులకు ఉచితంగా మట్టి తరలింపు అనే ముసుగులో మూడురోజుల నుంచి కూటమి నేతలు ఇరిగేషన్‌ అనుమతులకు విరుద్ధంగా మట్టిని దోచేస్తున్నారు. రైతులకు ఉచితం అంటూ ఆదేశాలు ఉన్నా ఇక్కడి కూటమి నేతలు మాత్రం ఒక్కో ట్రిప్పు ట్రాక్టర్‌ మట్టికి రూ. 600 లెక్కన రైతుల వద్ద నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. భారీ యంత్రాలతో ట్రాక్టర్లకే కాకుండా పెద్ద పెద్ద టిప్పర్లకు మట్టిని పోసి తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారుల అనుమతులు ఉన్న పొలాలకు మాత్రమే మట్టి తరలించాలన్న నిబంధన ఉంది. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు రెండు గ్రామాలలోని ముగ్గురు రైతులకు మాత్రమే అనుమతి ఇవ్వగా దానికి విరుద్ధంగా అనుమతులు లేని గ్రామాలకు కూడా మట్టిని తరలించి కూటమి నేతలు రోజుకు లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతుల ముసుగులో ప్రతి రోజు దాదాపు 500 ట్రిప్పులపైబడి అక్రమ మట్టి రవాణా చేస్తున్నారు. అనుమతులకు విరుద్ధంగా మట్టి మాఫియా జరుగుతుందన్న సమాచారం సంబంధిత అధికారులకు తెలిపినా వారి వద్ద నుంచి ఎలాంటి చలనం లేకపోవంతో సంబంధిత అధికారులకు భారీ ముడుపులు ముట్టాయని మండలంలో చర్చ జరుగుతోంది.

ముగ్గురు రైతులకు మాత్రమే అనుమతి..

మట్టి తరలింపుపై మండలంలోని సాలాబాదు, ఒంటిమిట్ట గ్రామ రైతులుగా ఉన్న ముగ్గురికి మాత్రమే మూడు రోజుల క్రితం ఒంటిమిట్ట చెరువులో వారి పొలాలకు మట్టి తరలించుకునేందుకు అనుమతి ఇచ్చామని ఒంటిమిట్ట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ భాస్కర్‌ రెడ్డి తెలిపారు.

జేసీబీ సహకారంతో చెరువులో మట్టిని తరలించొచ్చు..

రైతులకు ఉచితంగా మట్టిని తరలించే విషయంలో జేసీబీని వాడుకోవచ్చు. ట్రాక్టర్లే కాకుండా టిప్పర్లను కూడా రవాణాకు ఉపయోగించవచ్చు. రైతులకు పూర్తి ఉచితంగా మట్టిని తరలించాలి. ఒక క్యూబిక్‌ మీటర్‌కు కేవలం ఒక రూపాయి మాత్రమే రైతు ప్రభుత్వానికి చెల్లించాలి. వారు చెల్లించిన రూపాయి కూడా మళ్లీ తిరిగి వారి ఖాతాలోకి జమ చేస్తాము. మూడు రోజులపాటు 500 క్యూబిక్‌ మీటర్ల వరకు తవ్వుకోమని అనుమతి ఇచ్చాం. అలా కాకుండా అనుమతులకు విరుద్ధంగా మట్టి రవాణా చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– కిషోర్‌, ఇరిగేషన్‌ శాఖ ఏఈ

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు

- ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులు
- ప్రశ్నిస్తే తమకు సంబంధం లేదంటూ తప్పుకునే ప్రయత్నం

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం చిన్న పసుపల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం ఒత్తిడితో పోలీసులు అక్రమ కేసులు నమోదు చేసి భయాందోళనకు గురి చేస్తున్నారు. ఇదేమని పోలీసులను ప్రశ్నిస్తే తమ చేతుల్లో ఏమీలేదని పోలీసు పెద్దలు చెప్పినట్లు నడుచుకుంటున్నామంటూ సమాధానం చెబుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దముడియం మండలం చిన్న పసుపల గ్రామంలో 120 సర్వే నంబర్‌ ప్రభుత్వ భూమిలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్నారు. సోమవారం ఉదయం ఉపాధి హామీ పనులు చేస్తున్న సమయంలో గ్రామానికి చెందిన కూటమి నాయకుడు గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి ఈ భూమి తమదని ఇక్కడి మట్టిని ఎవ్వరు తీసుకెళ్లేందుకు వీలు లేదని ఉపాధి కూలీలతో గొడవకు దిగారు. అయితే ఇది ప్రభుత్వ భూమి అని, ఇతరులకు సంబంధం లేదని కొంత మంది కూలీలు గోపాల్‌రెడ్డితో వాదించారు. అయితే ఉపాధి పనుల కోసం పంపిన ట్రాక్టర్‌ ఇంకా ఇంటికి రాలేదని ట్రాక్టర్‌ కోసం గ్రామ సర్పంచ్‌ రామలక్షుమ్మ భర్త రామమోహన్‌రెడ్డి పని వద్దకు వెళ్లాడు. ఎందుకు ఇక్కడ కంప అడ్డం వేశారని ప్రజలతో ఆరా తీస్తుండగా నీకెందుకు చెప్పాలి ఇది మా ప్రభుత్వం మా ఇష్టం వచ్చినట్లు చేస్తామంటూ గోపాల్‌రెడ్డి ఒక్కసారిగా అక్కడే ఉన్న కొడవలితో దాడి చేయబోయాడు. ఇంతలో రామమోహన్‌రెడ్డి సోదరుడి కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి అడ్డుకోబోగా అతనిపై కూడా దాడి చేశాడు. పక్కనే ఉన్న మరో కూటమినేత ఎనమల వెంకటేశ్వరరెడ్డి కూలీలను మీరు ఇక్కడి నుంచి వెళ్లిపోండి అంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న కూలీలు మరి కొంత మంది ఇదేమి అన్యాయం ఇది ప్రభుత్వ భూమి కదా మీకెందుకు భయపడాలంటూ ఎదురు తిరిగారు. దీంతో కూలీలను ఇష్టమొచ్చినట్లు తిడుతూ మీ అంతు చూస్తానని ఒక్కొక్కరిని నరుకుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ విషయమై పవన్‌ కుమార్‌రెడ్డి పెద్దముడియం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. అయితే కూటమి నాయకుడు గోపాల్‌రెడ్డి జమ్మలమడుగు రూరల్‌ పోలీసు స్టేషన్‌కు వెళ్లి తననే బెదిరించారంటూ అక్కడ లేని వ్యక్తులపై కూడా కేసు నమోదు చేయించారు. కాగా పెద్దముడియం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు తీసుకోవాల్సి ఉండగా రూరల్‌ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు తీసుకోవడం గమనార్హం.

ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్న పోలీసులు..

చిన్న పసుపల గ్రామంలో జరిగిన గొడవ కేసులో ఇరువర్గాల ఫిర్యాదులను తీసుకుని కేవలం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై మాత్రమే పెద్దముడియం పోలీసు స్టేషన్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ తిరుపాల్‌ కేసు నమోదు చేశారు. అయితే తిరుపాల్‌ మాత్రం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేశాను తప్ప తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఈ విషయమై సీఐ గోపాల్‌రెడ్డిని వివరణ కోరగా తనకు ఆ కేసులో ఎలాంటి సంబంధం లేదని అది కేవలం పెద్దముడియం స్టేషన్‌ పరిధిలో ఉన్న పోలీసులకు మాత్రమే సంబంధించింది అని చెప్పారు.